# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

పరోపకారం అన్నమాట వినగానే మనకి వెంటనే గుర్తు కొస్తాడు పట్టూ బాబాయ్. పట్టుపట్టి పరోపకారం చేయడంలో దిట్ట. ఆయనకు ఆయనే సాటి. అందుకనే ఆయనకి వినిపించేలా తమ కష్టసుఖాలను గురించి మాట్లాడుకోవడానికే జడుసుకుంటారు జనం.

పగలూ, రాత్రి, ఎండా వానా అని ఇలాంటివేమీ ఆయన చేసే పరోపకారానికి అడ్డు రాలేవు. పరోపకారం చేయాలనుకుంటే శీతాతపాలను లెక్క చేయని దీక్ష ఆయనది. దటీజ్ పట్టూ బాబాయ్!

ఆయన పూర్తి పేరు పట్టాభిరామయ్య. నాలుగైదేళ్లకు పూర్వం ఆయనకు భార్యా వియోగమయ్యింది. దూరపు బంధువు ఒక ముసలామె ఇంట్లో వుండి వండి పెడుతోంది.


వేళకింత తిని, పరోపకారం చేయడానికి వీధిలోకి వచ్చేస్తాడు ఆయన. భార్య పోయాక ఆయనకు మతి స్థిమితం లేదు అని జనం చాటున చెవులు కొరుక్కుంటూ ఎదుట మాత్రం ఎంతో గౌరవం ఒలకబోస్తుంటారు. అదీ ఆయన పర్సనాలిటీ.

వాన వచ్చేలా ఉంది. నేను క్లబ్బుకి వెళ్లాను. రెండాటలాడి వద్దామని బయలుదేరా. నేను గుమ్మాలెక్కుతుంటే పట్టూబాబాయ్ బయటకి వస్తూ కనిపించాడు.

రెయిన్ కోటు తొడుక్కుని కాళ్లకు రబ్బరు చెప్పులు వేసుకుని ఉన్నాడు. ఆయన ముఖంలోని వెలుగును చూడగానే నాకు అనిపించింది ఆయనకేదో

## పరోపకారి

**-వి. హేమ**



పరోపకారం చేసే అవకాశం వచ్చిందని.

"రెండాటలేద్దాం రండి" అంటూ పలకరించా మాట వరుసకి.

"నాకూ ఆడాలనే వుంటుంది. కానీ తీరికేది? అర్జంటుగా వెళ్లాలి"

"ఎక్కడికి?"

నేనలా అడగడం మీకెవరికీ నచ్చకపోవచ్చుగానీ నేనలా అడక్కపోతే పట్టూ బాబాయ్ నొచ్చుకుంటాడని నాకు తెలుసు. అందుకనే అడిగాను. ఆయన వెంటనే పురాణం విప్పాడు. 'దొరికిపోయా' అనుకున్నాను.

"నేను ప్రసాదరావు ఇంటికి వెడుతున్నా. అన్నట్లు నీకాయన తెలియదు కదూ. చెబుతా. వాళ్లకి ట్రాన్స్‌ఫరై ఈ ఊరు ఈ వేళే వచ్చారు. కొత్తపల్లివారి వీధిలోకి దిగారుట. ఊరు మారటం అంటే ఎంత కష్టమో నీకూ తెలుసుకదా? పాపం సామాను అవీ సర్దుకోలేక ఏం అగచాట్లు పడుతున్నారో ఏమో! నేను వెళ్లి కొంచెం సాయం చేస్తే బావుంటుంది. ఆ పిల్ల కొత్తగా కాపురానికి వచ్చిందిట. పాపం"

## వింత చర్చి


జెకోస్లోవికియా రాజధాని ప్రేగ్‌కి 70కిలోమీటర్ల దూరంలో సెడ్‌లెక్ అనే ఊళ్ళో ఒక అసాధారణమైన చర్చి ఉంది. దాంట్లో ఎన్నో ఆర్ట్ ఎగ్జిబిట్లు ఉన్నాయి. వాటన్నిటినీ వాస్తవంగా మనుషుల ఎముకలతో తయారుచేశారు. 1218లో ఒక మఠాధిపతి యాత్రాస్థలం నుంచి మట్టిని తెచ్చి ఆ చర్చినిండా జల్లాడట. అప్పట్నించి ఆ చర్చికూడా ఒక పుణ్యస్థలమైంది. దాంతో చర్చి వక్కనున్న శ్మశానం ఒక పవిత్రస్థలమైంది, 1318నాటికి అక్కడ 30వేల శరీరాల్ని పాతిపెట్టారు. 1511నాటికిక చోటులేక పాత ఎముకల్ని తొలగించి కొత్తవాటికి చోచు కల్పించాల్సి వచ్చింది. అక్కడ్నించి ఇదొక సంప్రదాయంగా మారిపోయింది. 1870లో అలాంటి అవసరం వచ్చినప్పుడు అప్పటి సేనాధిపతి ఆ చర్చిని ఈ పాత ఎముకలతో అలంకరించమని ఒక స్థానిక చిత్రకారుడిని నియోగించాడట. ఈ అలంకరణకి ఆ చిత్రకారుడు 40వేల ఎముకల్ని ఉపయోగించాడట. అలాంటివాటిలో సీలింగ్‌కి వ్రేలాడుతున్న శాండ్లియర్‌ని చిత్రంలో చూడవచ్చు.

-తటవర్తి

## తొలి ఆధునిక నాటకం

ఏ భాషలోనైనా నాటక రచన, ప్రదర్శన ఒక ప్రక్రియ. ప్రజలకు నచ్చే మాధ్యమం నాటకం. 1860లో బెంగాలీ భాషలో దీనబంధు రాసిన 'నీలదర్పణ్' అనే నాటకం తొలి ఆధునిక భారతీయ నాటకం. ఈ నాటక ప్రదర్శనను ఇంగ్లీష్ అధికారులు నిషేధించారు.

-భూక్యా గోపినాయక్



"ఇలాంటి శతభిషలేమీ పెట్టుకోను. ఎవరికైనా సాయం చేయాలనుకుంటే చేసేయడమే. రాత్రి అనీ చీకటనీ సాకులు వెతకను. అయినా ఆ ప్రదేశం అంతా నాకు కొట్టిన పిండే. అడ్రస్ తెలియదనుకో. దానికీ ఓ చిట్కా వుంది. ఇల్లు ఇట్టే పట్టుకోగలను. ప్రతి గుమ్మం దగ్గర ఆగి తలుపు కొడతా. ఎవరో ఒకరు వచ్చి తలుపు తెరుస్తారు కదా"

"అవును" అన్నా.

ఆ చిట్కా ఏమిటో తెలుసుకోవాలని ఉబలాటపడ్డాను.

"ఇకనేం? ప్రసాదరావుగారున్నారా అని అడిగితే అది ప్రసాదరావుగారి ఇల్లయితే సరే! కాదనుకో. ఆ మాటే చెబుతారు. వెంటనే తరువాత గుమ్మం దగ్గరకెళ్లి మళ్లీ అలాగే తలుపు కొట్టాలి. సేం ప్రొసీజర్. అయితే అవునంటారు, కాకపోతే కాదంటారు. అంతేకదా. అలా ఓపిగ్గా ప్రతి గుమ్మం తడుతూ పోతే ఎక్కడో ఒకచోట మనకి ప్రసాద్‌గారిల్లు తగలకపోదు. అవునా?"

'హరి నీ ఇల్లు బంగారంగానూ పట్టుబాబాయ్' అనుకుంటూ తెల్లబోయాను.

రెయిన్‌కోట్ బొత్తాలు పెట్టుకోవడం పూర్తవడంతో బాబాయ్ వెళ్లిపోయాడు.

***

మరునాడు కూరల బజార్‌లో పట్టుబాబాయ్ కనిపించాడు. ఆ రోజు సెలవురోజు కావడంతో రాత్రి ఏం జరిగిందో తెలుసుకుందామనిపించి బాబాయ్‌ని పలకరించాను. ఆయన ముఖంలోని ఆనందం చూస్తే ఇల్లు దొరికిందనిపించింది.

"రాత్రి ఓ పాతిక ముప్పై ఇళ్ళ తలుపులు కొట్టుంటా, అంతే వాళ్లిల్లు దొరికింది. రాత్రి నేవెళ్లడం ఎంత మంచిదయిందో తెలుసా? పాపం ఒంటరిగా ఉన్నారు వాళ్ళు. అసలే కొత్త ఊరాయె. నేను వెళ్లకపోతే ఏం తిప్పలు పడేవారో ఏమో!

ఒక మంచి పని చేయాలనుకుంటే ఎన్నో ఆటంకాలు వస్తాయి మరి. వాటన్నింటినీ తప్పించుకుని చేయదలచుకున్న పనిని పూర్తి చేయడంలోనే కనిపిస్తుంది మన సత్తా. నేను ఇలా రైలు కట్ట దాటి రెండు అడుగులు వేశానో లేదో కరెంటు పోయింది. చీకటి, వాన. ఏదైనా అవకుండా జనం అప్పుడే నిద్రలకి పడ్డారో ఏమో ఏ ఒక్క ఇంట్లోనైనా దీపం వెలిగిస్తే ఒట్టు. ఆ కటిక చీకట్లో అలాగే తడుముకుంటూ గుమ్మాలెక్కి ఒక్కొక్క తలుపే కొట్టాను. ప్రసాదరావు ఇల్లు కనుక్కోవడానికి గంటపైనే పట్టింది. అయినా నేను శ్రమను పట్టించుకోను.

నేను తలుపు కొట్టగానే ఎవరూ వెంటనే తలుపు తెరిచిన పాపాన పోలేదు. నెమ్మదిగా లేచి దీపం వెలిగించి కిటికీ దగ్గరకొచ్చి తొంగి చూసిగానీ ఎవరూ పలకరించిన పాపాన పోలేదు ఎవరూ కూడా. మొత్తానికి ఎల్లాగైతేనేం ప్రసాదరావు ఇల్లు కనుక్కున్నాను"

పొంగి వచ్చే నవ్వును ఆపుకోవడం కష్టమవుతోంది నాకు.

"చాలాసేపు తలుపు కొట్టాక ప్రసాదరావు కిటికీ పక్కకొచ్చి నిద్ర నిండిన గొంతుకతో "ఎవరూ?" అని అడిగాడు.

"ప్రసారావుగారి ఇల్లు ఇదేనా?" అన్నాను.

"అవును" అంటూ అతను చాలా కంగారు పడిపోయాడు.

టెలిగ్రాం వచ్చిందనుకున్నాడట.

తరువాత చెప్పాడులే. నేను అతనికి నా నామగోత్రాలు చెప్పుకుని ఒక్కసారి తలుపు తీయమని అడిగాను.

అతడు "క్షమించండి. నిద్రపోతున్నాము. రేపు రండి" అన్నాడు. "అతడంత వినయంగా మాట్లాడుతుంటే నాకు జాలేసింది"

పట్టుబాబాయ్ చెప్పుకుపోతున్నాడు.

"నేనతన్ని వారించాను. బాబూ! నువ్వలా క్షమించమని అడగడం ఏమీ బాగాలేదు. మనలో మనకి క్షమాపణలేమిటి? తాళం కిటికీలోంచి బయటకు పడేయ్. తలుపు నేనే తెరచుకుంటా. నువ్వెళ్లి మొహం చన్నీళ్లతో కడుక్కుని బట్టలు మార్చుకుని రా ఈలోగా. అప్పుడింక నిద్రంతా ఉష్‌కాకి అన్నా. అవునుగానీ వాళ్లంత తొందరగా పడి నిద్రపోయారంటే వాళ్లెంత అలసిపోయారో అనిపించింది.

కానీ ఎంతో పట్టుపట్టాకగానీ ప్రసాదరావు తలుపు తెరువలేదు. మొహమాటస్తుడు కాబోలు. గజిబిజిగా ఇల్లంతా పడి వుంది సామాను. నేనొక పెట్టి మీద కూర్చున్నాను. ఇంతలో అమ్మాయి కూడా లేచి వచ్చింది. వాళ్లిద్దర్నీ మరో రెండు పెట్టెలు చూపించి కూర్చోమన్నా. కబుర్లు మొదలుపెట్టాము. ఊరిని వాళ్లకి పరిచయం చేసాను. ఇంతలో ప్రసాద్ భార్య లేచి కాఫీ చేసి తెస్తానంది.

నేనొప్పుకోలేదు. అంత అలసి వుంది. ఆ పిల్ల చేసేదేమిటి? నేను చేస్తానన్నాను. వాళ్లెంత వారించినా పట్టించుకోకుండా వంటిల్లు వెతుక్కుంటూ వెళ్లాను లోపలికి.

నాలుగు పేకేజీలు విప్పి పది పదిహేను డబ్బాలు తెరిచి చూసాక కాఫీ పొడి దొరికింది. పాలు లేవుట. అలాగే బ్లాక్ కాఫీ తయారుచేసాను. కానీ వాళ్లు 'ఇందాకనే తాగాము. ఇక వద్దు' అన్నారు. నేనొక్కడ్నే తాగాను. చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. నెమ్మదిగా వాళ్ళు మాటలు ఆపేసి వింటూ కూర్చుండిపోయారు. నా టాలెంట్ నీకు తెలుసుకదా. ఒక్కడ్నే నడిపా సంభాషణంతా.

కాసేపటికి కదిలాడు ప్రసాదరావు. వాచీ చూసి 'అయ్యబాబోయ్! అర్ధరాత్రి దాటిపోయింది'' అంటూ కేక పెట్టాడు. ఊళ్లో వాళ్లందరిన్నీ పేరుపేరునా పరిచయం చేస్తున్నానేమో నాకు టైం తెలియలేదు. మళ్లీ సంభాషణ మొదలయింది.

మాట్లాడుతూనే ప్రసాదరావు క్షణక్షణానికి వాచీలోకి తొంగిచూస్తున్నాడు. ఆ పిల్లేమో అస్సలు మాట్లాడడం మానేసి ఆవులించడం మొదలుపెట్టింది. ఆ ఆవులింతలు చూస్తుంటే నాకూ నిద్ర ముంచుకొచ్చింది. 'రేపొచ్చి సామాను సర్దిపెడతా' అంటూ లేచాను.

నేను చెప్పానుకదా వాళ్లకి మొహమాటం ఎక్కువని. వాళ్లిద్దరూ ఏకగ్రీవంగా 'వద్దు వద్దు' అంటూ లేచారు. ఆ అమ్మాయేమో మరీను 'మీకెందుకండీ శ్రమ! పెద్దవారు రెస్టుగా ఉండడం మంచిది' అంటూ తెగ ఇదైపోయింది. నేను 'ఫర్వాలేదు వస్తా' అని చెప్పా''

హఠాత్తుగా పట్టుబాబాయ్ ఎలర్టయ్యాడు.

"అయ్యో నా మతిమండ! నేను వెళ్లాలి. ఈసరికి వాళ్లు సామాన్లు సర్దడం మొదలుపెట్టి వుంటారు. ఈ కూరగాయలు ఇంట్లో పడేసి నేను వెళతాను'' అంటూ పరుగులాంటి నడకతో వెళ్లిపోయాడు పట్టుబాబాయ్ పరోపకారం కోసం.

★★★

మళ్లీ బాబాయ్ కనిపించడానికి రెండురోజులు పట్టింది. క్లబ్బులో కాఫీ టేబుల్ దగ్గర కూర్చున్న నా దగ్గరకు వచ్చాడు బాబాయ్. కాఫీకి ఆర్డర్ చేసి కబుర్లు మొదలుపెట్టాడు.

"ఆ రోజు అలా కంగారుగా ప్రసాదరావు ఇంటికి పరుగెత్తానా. అప్పటికే వాళ్ళు చాలావరకు సామాను సర్దేశారు. ఫోటోలు గోడకి తగిలించారు. కానీ ఒక్కటీ సరైన చోట్లో ఉన్నట్లు అనిపించలేదు నాకు. ఫోటోలన్నీ క్రిందకు దింపి మేకులన్నీ పీకి సరిగ్గా ఉండేలా చూసి మేకులు కొట్టి ఫోటోలు తగిలించాను. సామాను కూడా అలాగే ఏవి ఉండాల్సిన చోట్లో వాటిని అమర్చేసరికి చాలా టైం పట్టింది.

మొత్తానికి పనంతా పూర్తి చేసే బయటకు వచ్చాను. ఈ సామాన్లలో కొన్ని ప్రసాదరావు స్టేటస్‌కు తగినట్టుగా లేవు. ఈమాటు వెళ్లినప్పుడు వాటిని అమ్మించేసి కొత్తవి కొనిపిస్తా'' అన్నాడు.

★★★

ఆ తరువాత చాలారోజులు నాకాయన కనిపించలేదు. క్లబ్బుకి రావడం కూడా మానేసాడు.

ఏం పని తొందరలో ఉన్నాడో ఏమో!

ఒకరోజు అనుకోకుండా నాకు రోడ్డుమీద ఎదురుపడ్డాడు.

"బాగున్నావా బాబాయ్'' అంటూ పలకరించాను.

పరుగున నా దగ్గరకొచ్చాడు.

"ఇదిగో అబ్బాయ్! ఎక్కడైనా ఓ రెండుగదులున్న డీసెంటు ఫ్లాట్ అద్దెకు దొరుకుతుందేమో చూద్దూ. ప్రసాద్‌కి కావాలి'' అన్నాడు బాబాయ్.

## అద్భుతమైన అబ్జర్వేటరి


ప్రపంచంలోకెల్లా అతి ప్రాచీనమైన అబ్జర్వేటరీ భారతదేశంలోనే ఉందన్న నిజం మీకు తెలుసా? విజ్ఞానరంగంలో మన ప్రాచీన భారతీయులు అసమాన ప్రగతిని సాధించారంటే విశ్వసించలేనివారే ఈ విషయాన్ని కూడా నమ్మరు. 1725లో మహారాజా జైసింగ్-2 చే ఢిల్లీలో నిర్మించబడిన అబ్జర్వేటరీనే ఈ ఖ్యాతినార్జించింది. ప్రపంచంలో ఈనాటికీ ఈ అబ్జర్వేటరీ తన ప్రతిష్టని నిలుపుకుంది. ఈ అబ్జర్వేటరీలో అతి పెద్ద సన్‌డయల్ ప్రత్యేకాకర్షణ. ఈ అబ్జర్వేటరీలో స్టార్స్ యొక్క పొజిషన్‌ను, గ్రహణకాలాన్ని తెలుసుకునే సాధనాలు కూడా రాతితో తయారు చేయబడినవే కావడం ఓ అద్భుతం.

-భూక్యా గోపీనాయక్

## డైటింగ్ చేసే చేపలు

మనుషులకే కాదు చేపలక్కూడా డైటింగ్ అవసరం అంటున్నారు బర్మింగ్‌హామ్ సీ లైఫ్ సెంటర్ శాస్త్రజ్ఞులు. వాళ్ళు పెంచుతున్న చేపలకి మామూలుగా పెట్టే ఆహారంలో సగం తగ్గించి పెట్టి వాటి శరీరాల్లో ఎలాంటి మార్పులు వస్తాయోనని పరిశోధిస్తున్నారు. దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదిలో జీవించే పిరానాస్ అనే పెద్దచేపలు ఓ పందిని క్షణంలో గుటుక్కుమని మింగేయగలవట.

-విమలారామం



"ఏం.. ఇప్పుడుంటున్న ఇంటికేమయింది?'' అని అడిగాను ఆశ్చర్యంగా.

"నేను మొదట్నుంచీ అనుకుంటున్నదే. ఈ మారుమూల ఉండడం ఏమిటి అని. ఏదైనా ఓ శుభ్రమైన అపార్టుమెంటు దొరికితే వెంటనే వాళ్లనందులోకి మార్పించేయాలనుకుంటున్నాను. నువ్వు కూడా కాస్త సాయం చేద్దూ నీకు పుణ్యం వుంటుంది'' అన్నాడు నా చేయి పట్టుకుని.

★★★

అలాగే కొద్దిరోజుల్లో ప్రసాదరావు కుటుంబం ఊళ్లోకి మారారు.


ఆ తరువాత పట్టుగారు వాళ్ల బ్లాక్ అండ్ వైట్ టీవీ అమ్మించి కలర్ టీవీ కొనిపించారు.

మిక్సీ, వాషింగ్ మిషన్ వగైరాలు కూడా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనిపించడం లాంటి పనుల్లో బాబాయ్ చాలా బిజీ అయిపోయాడు. ఆ మాట ఒకసారి కనిపించినప్పుడు ఆయనే చెప్పారు.



## సినీమాయ

సినీరంగంలోకి వచ్చాక తారలు ఎన్నో కలలు కంటుంటారు. అలా కన్న కలలు కొన్ని నిజమవుతాయి. కెరీర్‌లో మామూలుగా సాధించలేనివి ఇలా నిజం అవుతుంటాయి. ఎప్పటినుంచో 'మిస్ వరల్డ్'గా ఎంపికవ్వాలని భావించిన ఈషాడియోల్‌కి కల నిజమయ్యింది. అదీ సినిమాలోనే. విక్రం భట్ కొత్త చిత్రం 'అంకాహి'లో ఈషా మిస్‌వరల్డ్‌గా కన్పించి జనాన్ని అలరించనుంది.




వాళ్లలా అన్నీ అమర్చుకుని సౌకర్యవంతమైన ఇంట్లోకి ఇలా మారేరో లేదో అలా రారాని ఉపద్రవం వచ్చి పడింది వాళ్లకి. పట్టుబాబాయ్ వాపోయాడు. ప్రసాదరావు జ్వరపడ్డాడు పాపం.

ఒకసారి మా ఇంటిమీదుగా వెడుతున్న బాబాయ్‌ని ఆపి "అలా నీరసంగా కనిపిస్తున్నావేం బాబాయ్! కొంచెం కాఫీ తాగి పోదువుగానీ'' రమ్మంటూ పలకరిస్తే బాబాయ్ చెప్పిన విషయమిది.

"ప్రసాదరావు జ్వరంతో మూసిన కన్ను తెరవడంలేదు. నా మనసు మనసులోలేదు. డాక్టర్ దగ్గరకు వెడుతున్నా. మరెప్పుడైనా వస్తా'' అన్నాడు.

ఆ రోజు మొదలు నేను విక్టిమ్‌నైపోయాను. సరిగ్గా నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చి కాఫీ కప్పు చేతపట్టుకుని కూర్చునే టైమ్‌లోనే పట్టుబాబాయ్ మా ఇంటివతలున్న హాస్పిటల్‌కి ప్రసాద్‌రావుని ట్రీట్ చేస్తున్న డాక్టర్‌ని కలుసుకోవడం కోసం వచ్చేవాడు.

దారిలోనే వున్న మా ఇంటిలోకి ఒక్కడుగు వేసి కాస్సేపు కూర్చుని ప్రసాదరావు ఆరోగ్యం తాలూకు విశేషాలన్నీ వివరించి ఓ కప్పు కాఫీ తాగి వెళ్లేవాడు.

ఆ విధంగా ప్రసాదరావు అనారోగ్యాన్ని గురించిన బులెటిన్ ఏరోజుకారోజు నాకు అందేది.

ఓ రోజు "ప్రసాద్‌కి వచ్చిన జ్వరం టైఫాయిడ్ అన్నాడు డాక్టర్. చిన్నపిల్ల ఆ అమ్మాయేం చేయగలదు. నేనే వుంటున్నా రాత్రిళ్ళు అతని దగ్గర. అతనికి మధ్యమధ్య సంధించేది కూడా. పాపం... కళ్ళు తెరవకుండానే ఏమేమో మాట్లాడేవాడు. నేనూ బలవంతంగా నిద్ర పోకుండా ఉండేవాణ్ణేమో! మత్తుగా ఉండి కొన్ని తెలిసేవి, కొన్ని మాటలు అసలు తెలిసేవికావు. ఒకరోజేమో 'ఆ ముసలి భూతం విరగబడిందా?' అంటూ పెద్దగా కేక పెట్టాడు. నా గుండె జారిందంటే నమ్ము. మర్నాడే వెళ్లి రక్ష రేకు తెచ్చి దిండు కింద పెట్టాగాని నా మనసు స్థిమితపడలేదు.

మరోరోజు 'ఈరోజు జ్వరం తగ్గింది. కానీ అబ్బాయి ఎందుకో పెద్దగా మూలుగుతున్నాడు. అమ్మాయి కూడా దగ్గరే ఉంది. 'నీరసం కాబోలు జావ కాచి తెస్తానన్నా'. అమ్మాయి ఒప్పుకోలేదు. 'బాబాయ్! నేను చూసుకుంటాను. మీరు పెద్దవారు. ఇంతవరకు పడ్డ శ్రమ చాలు. కాసేపలా పార్కులో గడిపితే మీకు మంచి ఆరోగ్యం వుంటుంది' అంటూ నన్ను బలవంతంమీద బయటకు పంపించింది.

పట్టుగారి సేవల మహిమో, డాక్టర్ వైద్య మహిమో, ఆ అమ్మాయి సుకృతమో ... మొత్తంమీద ప్రసాదరావు పథ్యం తిన్నాడు.

★★★

కొన్నాళ్లకి అంటే చాలారోజుల తరువాత పట్టుగారు ఆ రోజు క్లబ్బుకి వచ్చారు.  అందరూ పలకరించారు. అడిగినవాళ్లకి అడగనివాళ్లకి కూడా చెప్పుకొచ్చాడు ఆయన ప్రసాదరావు గురించి.

"టైఫాయిడ్ అంటే మాటలా? ఇరవై ఒక్కరోజుల జ్వరం. పాపం చాలారోజులు అసలు ప్రసాదరావు మూసిన కన్ను తెరవలేదు. నాకు చాలా భయమేసింది. అతను మంచానపడ్డది మొదలు ఒక్కరోజు ఒక్కరోజంటే ఒక్కరోజు నాకు నిద్ర వుంటే ఒట్టు. నయమయింది. ఫలితం దక్కింది. ఆ దంపతుల కృతజ్ఞత చూసి తీరాలి. చెబితే నమ్మేలా ఉండదు చూసి తీరాల్సిందే. అందునా ఆ అమ్మాయి మరీనూ. 'బాబాయ్ మీరు చాలా అలసిపోయారు. మీరు కొన్నాళ్లపాటు కొన్నేళ్లేమిటి చాలారోజులు గుమ్మం దిగకుండా రెస్టు తీసుకోండి'' అంటూ పరిపరి విధాలా బ్రతిమాలింది తెలుసా?''

జనం ముసిముసిగా నవ్వుతున్నా పట్టుబాబాయ్ ఏనాడూ పట్టించుకోలేదు.

★★★

నాలుగురోజుల తరువాత పట్టూ బాబాయ్ మా ఆఫీసుకు వచ్చాడు. లంచ్ అవర్ ఏమో కాంటీన్‌కి తీసుకెళ్లా. కాఫీ త్రాగుతూ చెప్పాడు బాబాయ్.

"ఈవేళ ఏం జరిగిందో తెలుసా? ప్రసాదరావు ఇంటికి వెళ్లాను. అతను ఇంట్లో లేడు. అమ్మాయి ఉంది. ఏమందో విను. 'బాబాయ్! ఒంట్లో ఓపికున్నప్పుడే మనం మన గురించి కూడా ఆలోచించుకోవాలి. ఒకసారి మీరు దక్షిణాది యాత్రలన్నీ చేసి రాకూడదూ! మనవైపు దేవుళ్లే కాదు దేవాలయాలు కూడా చూడదగ్గవే. వెళ్లి రాకూడదూ' అంది.

"నేనా యాత్రలన్నీ మీ పిన్నమ్మ బ్రతికుండగానే వెళ్లి వచ్చానమ్మా. మళ్లీ ఎందుకు?" అన్నాను.

"అలాగా?" అంటూ క్షణం ఎందుకో చిన్నబోయింది అమ్మాయి. అంతలోనే తేరుకుని "పోనీ ఉత్తరాది యాత్రలకు వెళ్లండి. కాశీ, గయ, ప్రయాగ.. ఇలా ఎన్నో. హిమాలయాల అందం చూసి తీరాలంటారు. ఇక కాశ్మీర్ భూలోక స్వర్గమే. ఓపికున్నప్పుడే చూడాలి అన్నీ. ఎప్పుడూ పరోపకారమే కాదు కాస్త స్వవిషయం కూడా చూసుకోవాలి" అంది. "నేనంటే ఎంత ఇదో వాళ్లకి" అన్నాడు.

"చాలా బాగుంది. అయితే ప్రయాణమెప్పుడు?"

"ఆ విషయం ఆ అమ్మాయే చూసుకుంటానంది. రైల్వేస్‌లో వాళ్ల వాళ్లెవరో ఉన్నారుట. యాత్రలంటే ఏమైనా కన్సెషన్ వుంటుందేమో కనుక్కుని టిక్కెట్ తనే తెప్పించి ఇస్తానంది. ఎంత ప్రేమో చూడు నేనంటే?" పట్టుబాబాయ్ గొంతు గద్గదమయింది.

ఆ అమ్మాయి తెలివితేటలకు ఆశ్చర్యపోయాను. పట్టుబాబాయ్ మాట్లాడుతూనే వున్నాడు.

"నేను వాళ్లమీద చూపిన అభిమానానికి పదింతలు ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారు వాళ్లు నామీద. స్వంత బిడ్డలులేని నాకు ఇంత ప్రేమ చూపేవారు ఇంకెవరు? నేను ఏకాకిని. నాకున్నది ఇటువంటి బిడ్డలు, మీలాంటి స్నేహితులు. ఈ జన్మకిది చాలు. ఈ ఊళ్లో నా మిత్రులు నన్ను అభిమానిస్తూ 'వద్దు వద్దు' అంటూనే నా సహాయాన్ని, సలహాల్ని అందుకుంటూ తృప్తి చెందడం తలచుకుంటే నా మనసు ఆర్ద్రమైపోతుంది. నాకంటే అదృష్టవంతుడెవరు అనుకుంటాను. నాకంతకంటే ఇంకేం కావాలి?" అన్నాడు.

***

యాత్రలకు వెళ్లిన పట్టుబాబాయ్ తిరిగి రావడానికి చాలారోజులు పట్టింది.

ప్రయాణం బడలికతో వయస్సువల్ల వచ్చిన నీరసంతో ఆయన ఎక్కడకూ వెళ్లలేకపోతున్నాడు.

ఎక్కువకాలం ఇంట్లోనే గడిపి అప్పుడప్పుడు మాత్రం క్లబ్బుకి వస్తున్నాడు ఇంటికి దగ్గరలోనే ఉండడంవల్ల.

ఒకరోజు బాబాయ్ నా దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

"ఎలా ఉన్నావు బాబాయ్?" అని అడిగాను పేకలు కలుపుతూ.

"బాగానే వున్నాను. కానీ వెనుకటి ఓపిక సన్నగిల్లింది. దూరాలు నడవలేకపోతున్నాను. యాత్ర నుండి రాగానే ఒక్కసారి ప్రసాదరావు ఇంటికి వెళ్లి వచ్చా. అప్పుడు ఇంట్లో ప్రసాద్ లేడు. అమ్మాయికో థాంక్స్ చెప్పి వచ్చేసా. నీకిది తెలుసా? ప్రసాదరావు ఎప్పుడు క్లబ్బుకి వచ్చినా ముందు నా గురించే అడుగుతాడుట. వాచ్‌మెన్ చెప్పాడు. కానీ ఇద్దరం దసుకులవ్వక అతడ్ని కలుసుకోవడం కుదరడమేలేదు" అని బాధపడ్డాడు బాబాయ్. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

***

ఒకరోజు దారిలో ఒక స్నేహితుడు కనిపించడంతో మాట్లాడి క్లబ్బుకి లేటుగా వచ్చాను.

సరిగ్గా అప్పుడే వచ్చిన ఒక యువకుడు బైక్ పార్కింగ్‌లో పెట్టకుండా కాలొన్ని నిలబడి వాచ్‌మెన్‌తో మాట్లాడుతున్నాడు.

"పట్టూగారు ఉన్నారా" అని అడిగాడు.

"ఉన్నారండి. ఇప్పుడే క్లోక్‌రూంకి వెళ్లారండి" అన్నాడు వాచ్‌మెన్.

వెంటనే ఆ యువకుడు బైక్ వెనక్కి తిప్పి స్టార్టు చేసుకుని వెళ్లిపోయాడు.

"ఎవరతను?" అని వాచ్‌మెన్‌ని అడిగాను.

"ఆయనాండీ..ప్రసాదరావుగారని బ్యాంక్ ఆఫీసరండి. ఈమధ్యనే మన క్లబ్బులో చేరాడు. చాలా చిత్రమైన మనిషండి. ప్రతిరోజూ వస్తూనే అడుగుతాడండి 'పట్టుబాబుగారున్నారా?' అని. ఉన్నారంటే బయటకి, లేరంటే లోపలికి వెళతారండీ" అంటూ నవ్వాడు వాచ్‌మెన్.

★



## నో డ్రింక్ ప్లీజ్

సల్మాన్ ఖాన్ గాళ్‌ఫ్రెండ్ కత్రినా కైఫ్ ఈమధ్య ఓ ఫ్యాషన్ షో పార్టీలో డ్రింక్ తీసుకుందిట. అయితే అందులో ఎవరో కావాలనే ఏదో కలిపిచ్చారట. దాంతో ఆమెకి వైరల్ ఫీవర్ వచ్చేసింది. అంతే! ఇకపై ఎప్పుడూ ఇలాంటి పార్టీల్లో ఏమీ తాక్కూడదని తీర్మానించుకుందిట. బహుశా సల్మాన్ ఖాన్ చేత్తో అందిస్తే తాగుతుందేమోనని సినీ జనాలు గుసగుసలాడుకుంటున్నారు.

